# దొంగలు... దొంగలు

“సోదర సోదరీ మనులారా... ఈ రోజు మన ఊరి గడీలో జరుగబోయే బ్రమ్మాండమైన నాటకం మాయా బజార్.... చూడండి, చూసి ఆనందించండి. మాయా బజార్. మంచి మంచి పాటలు, అందమైన ఆటలు, మిమ్మల్ని కడుపుబ్బనవ్వించే మాటలు. తప్పక చూడండి. చూసి ఆనందించండి. ఆలోచించిన ఆశా బంగము. మంచి సమయం మించిన దొరుకదు. మీ అభిమాన పంతులు జంగం పంతులు నేర్పిన మాయా బజార్.... మరువకండి మాయా బజార్... టికెట్లు రేట్లు... నేలకు చారానా, చాపకు ఆటానా, బేంచికి బారానా, కుర్చీ రూపాయి.... మరువకండి సోదరులారా మాయా బజార్.. మీ

అభిమాన నటులు ఏశాల రాములు, కుంటిపోశి బాలయ్య... ఎనగంటి బాల్‌నర్సు..." చేతులో పుంగీ వట్టుకుని మెడలో తబులా వేసుకుని దప్పదప్ప కొట్టుకుంట చాటింపు వేత్తండు బెస్తలింగం.

చాటింపు వేసినప్పుడే అనుకున్న వీళ్లు ఎట్లయినా 'మాయాబజార్' మంచిగ ఆడుతరని. ఎందుకంటే మా ఊర్లె ఎవలు గూడా నేలకు ఇంత, సాపకు ఇంత, బేంచికి ఇంత, కుర్చికి ఇంత అని ఇంతవరకు టికెట్లు పెట్టలేదు. ఒక్కటే టికెటు ఉంటుండె.

మేము మొన్న ధర్మ కంకనం ఆడినంగదా! అది పేలయిపాయె. ఇయ్యాల్ల వీళ్లు గనుక మంచిగ ఆడి 'శెబ్బాష్' అనిపించుకున్నరనుకో! మా మ్యాల్లం పని అయిపోతది. మేటి ఏశకాళ్లు జంగం పంతులు మ్యాల్లంల చేరిపోతరు. మాది ఇచ్చుక పోతది.

ఈ మాట నేనే గాదు. ఊరు ఊరంతా అనుకుంటున్నరు. 'ఏశాల రామడు సన్నపోడుగాదు. ఈతలు నేర్చినోడు. ఏదో మాయ జేత్తడు' అంటున్నరు. నాకు పొద్దంతా ఇదే ఆలోచన. బడినుంచి ఇంటికి రాంగనే పుస్తకాల సంచిని గూట్లె వెట్టి సక్కగ గడీలకు పోయిన.

వీళ్లు గూడా మైకు వెట్టింండ్రు. రికాడు లేత్తండ్రు. స్టేజీ మేము వేసిన జాగలనే వేసింండ్రు. ముందట సాపలు పరిచింండ్రు. వెనుకకు నేల. ముందటనే ఒక పక్కకు నాలుగైదు బేంచీలు, మరో పక్కకు ఐదారు కట్టె కుర్చీలు వేసింండ్రు. మైకులో అప్పుడప్పుడు 'సోదర సోదరీమనులారా..' అని చెప్పుతండ్రు.

మా బడిపిల్లలంతా అక్కడనే ఉన్నరు. పాటలకు డ్యాన్స్ జేస్తండ్రు. కొందరు టొక్క ఆడుతండ్రు. ఇంకొందరు రేసాడుతండ్రు. నలుగురైదుగురు ఒక మూలకు నాటుకమే ఆడుతుండ్రు. నేను మాత్రం స్టేజి చుట్టూ తిరిగి సూత్తున్న. వాళ్లు ఏమనుకుంటున్నరో వింటున్న.

స్టేజి మీద మేన్ పరుదా కొత్తగా ఉంది. ఎవరిదో అడుక్కచ్చినట్టున్నరు. స్టేజి పెద్ద పీటలతోనే వేసింండ్రు. అరటాకులు కొబ్బరాకులు కట్టి పెండ్లి పందిరి లెక్క చేసింండ్రు. సైడు పరుదాలు పెద్దగా ఉన్నయి. కిందా, పైన ఎర్రటి బట్టను స్టేజి చుట్టూ కుచ్చులు కుచ్చులుగా కట్టింండ్రు. ఎల్బర్ బాల్‌రాజు కరెంటు బుగ్గలు పెట్టి రంగు రంగు కాయిదాలు చుడుతున్నడు.

మాయా బజార్ నాటకంల శశిరేఖ పెండ్లి ఉంటది. పెండ్లి చేయడానికి బామని పంతులును మాట్లాడినారట. నిజంగ పెండ్లి లెక్కనే జేత్తరట. ఈ ముచ్చట ఊరంతా మాట్లాడుకుంటున్నరు.

ఈ స్టేజీ చూసినంక నాకు గట్టినమ్మకం కుదిరిపోయింది. ఎట్లయినా 'మాయాబజార్' ఆట దుమ్మురేగుతదనుకున్న. జంగం పంతులు గూడా ఉత్తుత్త మనిషిగాదు. ఏదో ఒకటి చేసి జనాలను మెప్పిస్తడనుకున్న. ఈ పోటీ మా రెండు మ్యాల్లాలకు గాదు. ఇద్దరు పంతుళ్లకేనని అనిపించింది. ఈ మాట నేనే కాదు జనం కూడా అంటున్నరు.

ఈ మాటలన్నీ విన్నాక మాకొండయ మామకు భయం పట్టుకుంది. కొత్త పరుదాలకు, తబులాలకూ, పల్లీల హార్మానికీ వెయ్యి రూపాయలదాకా పెట్టుబడి పెట్టిండు. నాలుగు ఆటలు ఆడి ఆ బాకీని నింపుకుందామనుకునేలోపునే ఈ పోటీ పడింది. వాళ్లకు మంచి పేరస్తే మా నాటుకాన్ని ఎవలూ చూడరనీ మామ భయం. అందుకని ఆ రోజంతా మా దాసు చిన్నాయిననను వెంటేసుకుని ఊరంతా తిరిగిండట. ఊరంతా ఏమనుకుంటున్నారో విన్నడట.

మసుకు పడ్డాక మరోసారి చాటింపు వేసింద్రు. మైకుల చెప్పేది చెపుతున్నరు. నేను మా లస్మవ్వను చారాన అడుక్కున్న. అన్నం తిని గడీలకు పోయిన. గేటు ముందట టేబుల్ వేసుకుని టికెట్లు అమ్ముతున్నరు. గేటు దగ్గర ముగ్గురు మనుసులు కావలున్నరు. టికెట్లు తీసుకుని లోపలికి పంపిత్తున్నరు. ఇదెట్లుంటదో సూస్తామనుకున్నట్టున్నరు జనం. రషి బాగానే ఉంది.

నేను చారాన ఇచ్చి నేలకు టికెటు తీసుకున్న. టికెట్‌ను చూసినంక నాకొక ఐడియా వచ్చింది. వెంటనే మిగిలిన టికెట్లు గూడా చూసిన ఓరినీయవ్వ... ఇంతేనా...? అనుకున్న. సక్కగ మా ఇంటికి పోయిన. నేను ఆడుకునే సిగరెట్ డబ్బా పత్తాలు తీసిన. ఒక సీసమీది మూత తీసిన. దానికి సిరాపూసి చార్మినార్ పత్తా మీద ముద్రవేసిన. నేల టికెట్ రెడీ. బర్కిల్ సిగరేట్ పత్తా మీద రెండు ముద్రలేసిన. చాప టికెట్ రడీ. ఇట్లా నేల టికెట్లో నాలుగు, చాప టికెట్లో నాలుగు తయారు చేసిన. బెంచికి కుర్చికి వాడిన పత్తాలు నా దగ్గర లెవ్వు.

ఈ టికెట్లల్ల మా అమ్మకొకటి ఇచ్చిన. అక్కకు రెండిచ్చిన. మిగిలినయి జేబులేసుకుని పోయి మాదోస్తులకిచ్చిన. నేను సాపలకు పోయి కూసున్న. మా మ్యాల్లెం వాళ్లు ఎవలన్నా వచ్చింద్రా అని చూసిన.

మా మ్యాల్లెం మొత్తం అక్కడనే ఉంది. ఒకడు కుర్చీల దగ్గర కొట్లాడుతున్నడు. ఇరిగిపోయిన కుర్చీ వద్దేవద్దంటున్నడు. ఇంకొకలు బెంచీలదగ్గర ఇక్కడ గాదు అక్కడ కూసుంటనంటున్నడు. ఒకడు సాపలు చినిగినయంటున్నడు. ఇంకొకడు నేలదగ్గర ఎనకవద్దు ముందటనే కూసుంటనంటున్నడు. ఇట్లా కావాలనే లొల్లి పెడుతున్నరు. చూస్తుండంగనే గడి నిండింది.

ఆట మొదలయింది. మొదలు మొదలే రెండు డ్యాన్స్‌లు చెక్కు చెక్కున లైట్లు మెరుత్తున్నయి. బుడ్డెనుకాడు మస్తునవ్విత్తండు. మాట మాటకు నవ్వుడే, పాటలు కంద పద్యాలైతే మోత మోగుతున్నయి. పల్లీల హార్మోని మీద రాగం గాకపోతే రాగం తీత్తండ్రు. వేశాలు గూడ బొమ్మల లెక్క కుదిరినయి. జనం అట్లాంటి నాటుకాన్ని ఎప్పుడూ చూడనట్టుగనే చూస్తండ్రు.

అంతవరదాకా నాకు ఏదో మూల కొద్దిగా ఆశ ఉండె. నాటకం కొద్దిగా జరిగిన తర్వాత నా ఆశ అడుగంటింది. ఖచ్చితంగా మా మ్యాల్లం పని అయిపోయినట్టే అనుకున్నా.. ఇట్లా అనుకోగానే నాకు భయం మొదలయింది.

నా పక్కనే కూసుంది గొల్ల ఎంకట్రాజవ్వ. ఆమెకు ఐదుగురు కొడుకులు. ఏరువద్దరు. ఒక్కటే ఇంట్ల తడుకలు కట్టుకుని ఉంటున్నరు. ఆమె ఇద్దరు కొడుకులు ఇదే మ్యాల్లంల ఉన్నరు. అందుకనే అందరికందరు ఇంటికితాళం వేసి వచ్చిండ్రు. ఎంకట్రాజవ్వ నోరు బలే పెద్దది. ఎవలకూ భయపడది. మేము గోడ పక్కన కూసున్నం. అక్కడ చీకటి చీకటిగానే ఉన్నది.

ఆట ఇంక కొద్దిగా సాగిందో లేదో బేంచి మీద కూసున్న మా దాసు చిన్నాయిన నాదగ్గరికి వచ్చి కూసున్నడు. ఎందుకు వచ్చిండో అర్థం గాలేదు. నెత్తికి ఎర్రరుమాలు చుట్టిండు. లుంగీని గోశివోసుకున్నడు. ముందుగా నేనే గుర్తుపట్టలేదు.

గుర్తువట్టినాక 'ఏంటిది చిన్నాయినా... బేంచిమీది నుంచి కిందికి వచ్చినవు' అని నేను అడిగేలోపే... 'అరేయ్... ఇంటికిపోదాం నడువురా.. ఊర్లెకు దొంగలచ్చిండ్రట... గొల్ల ఎంకట్రాజవ్వ ఇంట్ల పడ్డరట' అన్నడు గొంతుని తగ్గించి.

నేను నిజమే అనుక్న్న. ఎంకట్రాజవ్వ నా పక్కనే ఉందికదా! ఈ మాటలు విన్నది. ఆగమాగాన లేచి నిలవడ్డది. నెత్తి ముడుసుకుంటూ.. 'కోటా.. ఎల్లుగా... రాజిగా... యాడున్నరురా... నడువుండ్రిరా... నడువుండ్రి.. దొంగలు వడ్డరట. నీ ఆటపాడుగాను. వద్దు వద్దనంగ ఇల్లుకు తాళమేసి వత్తిరి. దొంగలురో.. దొంగలు...' అని బొబ్బెకెత్తుకుంది.

దొంగలనంగనే అందరికీ భయం పట్టుకుంది. నేను నిలబడి చుట్టూచూసిన. మా మ్యాల్లంవాళ్లు ఎవరూ కనిపించలేదు. దాసుచిన్నాయిన గూడా మాయమయిండు. అప్పుడే బలబలమని ఇండ్లమీదికి రాళ్లు పడ్డయి. వాడలల్ల 'వచ్చెరో పాయెరో' అని కేకలు బొబ్బలు మొదలయినయి.

జనం పుట్ట బెదిరినట్టు బెదిరిండ్రు. అందరూ ఒక్కసారే లేచి నిలవడ్డరు. గేటుకు అడ్డంగా కట్టిన దుప్పట్లను ఇసిరికొట్టి పరుగందుకున్నరు. అంతవరకూ ఏ చప్పుడూ

లేని ఊరు ఇప్పుడు కేకలు బొబ్బలతో నిండిపోయింది. పావుగంటలో గడీ మొత్తం ఖాళీ అయింది.

అప్పటికీ ఆట జోరందుకున్నది. దుర్యోధనుడు వచ్చిండు. లక్ష్మణకుమారునికి పెండ్లి చూపులు. ఆట కమ్మేది అప్పుడే! వేశకాళ్లు గూడా వేశాలు ఇప్పకుండానే ఇంటికి ఉరుక తలిగింౘ్రు.

మా కొండయమామ మురిపెం చెప్పరాదు. తెల్లారి దాసు చిన్నాయినకు తాగినంత కల్లు తాగిచ్చిండట. 'నేను ఏమో అనుకున్న గనీ దాసు బావా... నువ్వు దండోనివి' అన్నడట.

ఇగ మాకు మంచి చాన్స్ దొరికింది. వారం రోజులు ఆగి అదే 'ధర్మ కంకనం' నాటకాన్ని మూడు తొవ్వల దగ్గర ఏసినం. కొండయ మామకు ముందుగనే భయం చెప్పినం. అయినా చేసేది చేసిండనుకో.. ఈసారి ఆటగాకపోతే ఆట కమ్మింది. ఊరు ఊరంతా మెచ్చుకున్నరు.

మేము ఆడిన మూడవ నాడే అదే జాగల స్టేజివేసి జంగం పంతులు మ్యాల్లం వాళ్లు 'మాయాబజార్' ఆడింౘ్రు. వాళ్లేంతక్కువ తిన్నరా....! మోత మోగిచ్చింౘ్రు.

ఊరి జనం మాత్రం ఇద్దరూ బాగానే ఆడింౘ్రు గనీ 'మాయాబజార్' మ్యాల్లపోళ్లు రాగాలు మొదట తీసినంత మంచిగ తియ్యలేదు' అన్నరు. ఆ మాటలే మాకు మనుసు నింపినయి. కొండంత బంగారం దొరికినట్టయింది.

అప్పుడే మేము బాలనాగమ్మ ఆటను నేర్చినం. మేము మ్యాల్లం మొదలువెట్టి రెండేండ్లు దాటింది. ఎందుకోగని మ్యాల్లం ముందటిలెక్క పురిమీద లేదు. ఎవలకు వాళ్లే మొనగాళ్లయింౘ్రు.

మొత్తం మీద ఊర్లె రెండు మ్యాల్లాలయినయి. నువ్వా నేనా అన్నట్టుంది పోటి. వాళ్ళు మమ్ముల్ని పడగొట్టాలని, మేము వాళ్లను పడగొట్టాలని రియార్సల్ మొదలు వెట్టినం. అటు జంగం పంతులు, ఇటు పున్నయ్య పంతులు మాది గొప్పంటే మాది గొప్పని కొత్త కొత్త పద్ధతులు పెడుతంౘ్రు.

పోటీ మ్యాల్లాలకు గాదు. పంతుల్లకే ఉంది.